## శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచండి : కమిషనర్

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** నగరంలోని శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలని, కర్మ క్రియలకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. 33 వార్డులోని హరిశ్చంద్ర శ్మశాన వాటిక, దొబీఘాట్, సుందరయ్య నగర్, స్కావేంజర్స్ కాలని తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శ్మశానం చుట్టూ చెత్త చెదారం ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈ.ఈ. రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు. రమణ, రాజు, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసిపి మూర్తి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి ఉన్నారు.

# వరసిద్ధి వినాయకుని పేరుతో.. రైతుల పొలాలు

- 300 ఎకరాలకు పైగా ఆన్ లైన్‌లో ఎక్కిన వైనం
- లబోదిబోమంటున్న 137 మంది అన్నదాతలు




**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:** తిరుపతి జిల్లా, పాకాల మండలం, గుంత గాదంకిలో 137 మంది రైతులు 300 ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్నారు. అన్ని పట్టా భూములే. సిక్స్ లైన్ రోడ్డు హైవే విస్తరణ పనుల్లో వీరికి చెందిన మరో 300 ఎకరాలకు పైగా రోడ్డుకు నేషనల్ హైవే అథారిటీ తీసుకుంది. భూములు వారివే కాబట్టి నష్టపరిహారం కూడా చెల్లించింది. 2013లో ఈ భూములను సబ్ డివిజన్ చేయడంలో పాకాల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీరి భూములు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ భూములుగా ఆన్లైన్లోకి ఎక్కించేశారు.. భూములు మాత్రం రైతుల స్వాధీలోనే ఉన్నాయి. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద వీరు దరఖాస్తు చేసుకుంటే, ఆ భూములు మీవి కాదని, వరసిద్ధి వినాయక స్వామి ఆలయం కింద ఉన్నాయని సెలవిచ్చారు. దీంతో రైతులు లబోదిబోమంటూ పాకాల తాసిల్దార్ కార్యాలయం చుట్టూ గత 10 సంవత్సరాలుగా తిరుగుతున్నా ఫలితం లేదు. ఇది కాదని స్వయంగా జిల్లా కలెక్టర్ కలిశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటైన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సోమవారం కలిశారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటే రెవెన్యూ ల్యాండ్ కమిషనర్ మాత్రమే పరిష్కరించగలరని ఆయన తెలిపారు. అందరూ విజయవాడకు వెళ్ళి, హక్కుపత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలను, తదితర సాక్ష్యాలు తీసుకుని అక్కడికి పోతేనే పరిష్కారం అవుతుందని కలెక్టర్ తేల్చి చెప్పారు. దీంతో ఆ రైతులు ఇక రాష్ట్ర రాజధానికి పరుగులు తీసే పరిస్థితి ఏర్పడింది.

**రైతులు భూములు వారి పేరున ఆన్లైన్ ఎక్కించాలి**

రెక్కాడితే కాని డొక్కాడని రైతులు వాళ్ళు. అర ఎకరా, రెండు ఎకరాలు పెట్టుకుని పంటలు పండించుకుని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పాకాల రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటుకి గత 12 సంవత్సరాలుగా ఆ రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. రెవెన్యూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వన్ బి అడంగల్ రైతులు పేరుమీదనే ఆన్లైన్లో ఎక్కించాలి.

**-పి. హేమలత, రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

**మేము భూములు ఎవరికి ఇవ్వలేదు**

మా భూములు మా దగ్గరే ఉన్నాయి.. మేమే సాగు చేసుకుంటున్నాం. ఫలితం కూడా మేమే అనుభవిస్తున్నాం. శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి మా భూములు ఇవ్వలేదు. సిక్స్ లైన్ రోడ్డుకు మా భూములు కొంత పోతే నష్ట పరిహారం కూడా చెల్లించారు. కలెక్టర్ గారు న్యాయం చేయండి.

**– సుగుణమ్మ,బాధితురాలు**

**పాకాల మండలం, గుంత గాదంకి గ్రామానికి చెందిన నూట ముప్పై ఏడు మంది రైతులు బాధలు వర్ణాతీతం.. 300 ఎకరాల సాగు భూమిని వరసిద్ధి వినాయక దేవస్థానంలో రెవెన్యూ అధికారులు చేర్చేశారు. పాకాల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యపు ధోరణికి అన్నదాతలు లబోదిబోమంటున్నారు.**

## పని గంటల పెంపుకు వ్యతిరేకంగా మే 6న దేశవ్యాప్త సమ్మె

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు**

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** అధికారికంగా పని గంట ల పెంపుకు వ్యతిరేకంగా మే 6వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని ఆంధ్ర రాష్ట్రంలో కార్మిక వర్గం యావత్తు సమ్మెకు సన్నద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. తిరుపతిలో జరిగిన సిఐటియు రాయలసీమ వర్క్ షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలను ఒక్క కలం పోటుతో మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని లేబర్ కోడ్‌లలో పని గంటల పెంపు అధికారికంగా ప్రకటించారన్నారు. ఈ కారణంగా ఉద్యోగ, కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మే 6వతేదీన సబమ్మె జరుగుతుందని లేబర్ కోడ్ కారణంగా జరిగే నష్టాలను వివరిస్తూ పెద్ద ఎత్తున బుక్ లెట్స్, కరపత్రాలు విసారంగా తీసుకు వెళ్తామని, పని ప్రదేశాలలో సమావేశాలు నిర్వహించి కార్మికులను చైతన్యం చేస్తామని ఆయన ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని, కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్లాంట్ నడపడానికి అవసరమైన ముడి ఖనిజాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నుంచి డబ్బులను ఖర్చు చేయాలని ఆయన సూచించారు. 14వ తారీఖున విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై అమరావతిలో ధర్నాలు నిర్వహిస్తున్నామని, 7న సచివాలయ వాలంటీర్లు, స్కూలు ఆయాల సమస్యలపై, 18న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై, 19న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై, 20న సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలపై విజయవాడలో ధర్నాలు జరుగుతాయని తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు సిఐటియు మద్దతు తెలియజేస్తున్నదని తెలిపారు. 24వ తేదీన క్యాబాకు సంఘీభావంగా రాష్ట్రమంతటా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ విధానాలు, రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రానున్న మేడే సందర్భంగా విస్తారంగా ప్రచారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కటారి అజయ్ కుమార్, సిఐటియు తిరుపతి జిల్లా కార్యదర్శి కందారపు మురళి పాల్గొన్నారు.

## శ్రీసిటీని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

**ప్రజాశక్తి - వరదయ్యపాలెం :** ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీ సిబి) ఛైర్మన్ డా. పి. కృష్ణయ్యతో ఇటీవల చర్చల అనం తరం, శ్రీసిటీని మరింత పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు, శ్రీసిటీ యాజమాన్యం తన పారిశ్రామిక భాగస్వామ్యులతో కలిసి స్థిరమై న వనరుల వినియోగ విధానాలను మరింత బలోపేతం చేస్తోంది. "రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే సర్క్యులర్ ఎకానమీ మూల సూత్రాల ఆధా రంగా పర్యావరణ హాని గణనీయంగా తగ్గించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అన్ని నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణ పనులలో నది ఇసుక వాడకానికి ప్రత్యామ్నాయ మైన ఎం-సాండ్ (గ్రానైట్ రాళ్లను పొడిచేయ డం ద్వారా తయారయ్యే ఇసుక) ను 90 శాతం ఉపయోగించాలని, నది ఇసుక వినియోగాన్ని కేవలం 10 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించింది. ఈ నూతన విధానాల అమలు ద్వారా పారిశ్రామికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణ కు మధ్య సమతుల్యతను నెలకొల్పి, ప్రముఖ సుస్థిర పారిశ్రామిక కేంద్రమైన శ్రీసిటీ తన నిబద్ధతను చాటుకుంటోంది.

## మొబైల్ టెలి-సర్జికల్ యూనిట్ మంత్ర - ఎం ఆవిష్కరణ

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** దేశంలో మొట్టమొదటి, ఏకైక దేశీయ సర్జికల్ రోబోటిక్ సిస్టమ్-ఎస్ఎస్ఐ మంత్ర తయారీదారు ఎస్ఎస్ ఇన్నోవేషన్స్, గుర్గావ్‌లోని లీలాలో రెండో గ్లోబల్ ఎస్ఎస్ఐ మల్టీ-స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ కాన్ఫరెన్స్ 2025 ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడు తూ, ఎస్ఎస్ఐ మంత్రఎం ఒక మొబైల్ టెలిసర్జికల్ యూనిట్ కంటే ఎక్కువని తెలిపారు. హై-స్పీడ్ టెలికమ్యూనికేషన్, శాటిలైట్ కనెక్టివిటీతో ఇది భౌగోళిక అడ్డంకులను చెరిపేస్తుందని వివరించారు. నిరుపేదల ప్రాణాలను కాపాడే రోబోటిక్-సహాయక శస్త్రచికిత్సను అందిస్తుందన్నారు. టెలీ-సర్జికల్ విధానా లకు మించి, శస్త్రచికిత్స విద్య, టెలి-మెంటరింగ్, రియల్-టైమ్ రోగి డేటా విశ్లేషణలకు ఎస్ఎస్ఐ మంత్రఎం ఒక శక్తివంత మైన వేదిక. నిరంతర పరిశోధన, ఆవిష్కరణలతో అత్యాధునిక రోబోటిక్ శస్త్ర చికిత్స అత్యంత అవసరమైన వారికి చేరే దిశగా ఎస్ఎస్ఐ కీలక అడుగు వేస్తోందని తెలిపారు. అత్యాధునిక టెలి సర్జరీ సామర్థ్యాలను కలిగి ఉన్న ఎస్ఎస్ఐ మంత్రఎం మారుమూల ప్రాంతాలకు ప్రపంచ స్థాయి రోబోటిక్-సహాయక విధానాలను అందించడం ద్వారా శస్త్రచికిత్సలకు ఉన్న అడ్డంకులను చెరిపేస్తుందన్నారు. టెలి-సింక్ మొబైల్ యూనిట్ రిమోట్, ఆన్-సైట్ శస్త్రచికిత్సా బృందాల మధ్య రియల్-టైమ్ సహకారాన్ని ప్రారంభించడానికి ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్, హై-స్పీడ్ కనెక్టివిటీ, అధునాతన సర్జికల్ రోబోటిక్స్‌లను ఏకీకృతం చేస్తుందని తెలిపారు.

## స్టార్ హోటల్లో కూలిన సీలింగ్

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** తిరుపతి లోని మినర్వా గ్రాండ్ హోటల్ లో సోమవారం అర్ధరాత్రి సీలింగ్ ఊడిపడడంతో ఒక్కసారిగా భక్తులు భయాందోళనకు గురైయ్యారు. స్థానికుల కథనం మేరకు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న మినర్వా గ్రాండ్ హోటల్ అండ్ రెస్టారెంట్ లోని రూమ్ నెంబర్ 314 ఒకసారి గా కుప్పకూలిన సీలింగ్, భయం దోలనతో భక్తులు బయటకు పరుగులు తీశారు. మధ్యలో ఉన్న ఇద్దరు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాద ఘటన వివరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లకు టెండర్లు పిలవాలి

**శాసన సభలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** తన సత్యవేడు నియోజకవర్గంలో మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసెంబ్లీలో స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం శాసన సభలో మాట్లాడుతూ నియోజక వర్గంలోని పిచ్చాటూరు మండలం ముడియూరు, సత్యవేడు మండలం చమర్తి కండ్రిగలలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరయ్యాయని త్వరగా టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు. తన నియోజకవర్గంలోని పిచ్చాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రాలలో భారీ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారని, ఈ రెండు మండలాలలో బాలికలకు ప్రత్యే కంగా ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. బుచ్చినా యుడు కండ్రిగ, నారాయణవనం, నాగలాపురం మండలాలతో పాటు నియోజకవర్గంలో మిగిలిన జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం పనులు అర్థాంతంగా నిలిచిపోయాయని వాటిని పూర్తి చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వరదయ్యపాలెంలో బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ నిర్మాణ పనులు చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

## పిచ్చాటూరు, బి.ఎన్ కండ్రిగలలో బాలికల హైస్కూల్ ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - పిచ్చా టూరు:** 'పిచ్చాటూరు బాలికల పాటశాల కల్పించండి సార్' అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీలో చర్చించారు. పిచ్చాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రాలలో భారీ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారని, ఈ రెండు మండలాలలో బాలికలకు ప్రత్యేకంగా ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే బుచ్చినాయుడు కండ్రిగ, నారాయణవనం, నాగలాపురం మండలాలతో పాటు నియోజకవర్గంలో మిగిలిన జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం పనులు అర్థాంతంగా నిలిచిపోయి ఉన్నాయని, వాటిని పూర్తి చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం సభలో వివరించారు. వరదయ్యపాలెంలో బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ నిర్మాణ పనులు చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని కోరారు.

### ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు మాత్రమే

## ఇసుక రవాణా, తవ్వకాలు చేపట్టాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** ప్రజలకు అందుబాటులోకి పారదర్శకంగా, ఉచితంగా ఇసుక అందేలా, ప్రభుత్వం ఇసుక ద్వారా ఎలాంటి ఆదాయం ఆశించకుండా పలు చర్యలు చేపట్టిందని, ఈ నెల 15 లోపు జిల్లాలో మూడు డీసిల్టేషన్ పాయింట్ల నుండి సుమారు 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ యార్డు పాయింట్స్ పారదర్శకంగా, ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో తిరుపతి పట్టణ ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండుట కొరకు 3 ఇసుక స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి ఇసుక సరఫరా చేస్తున్నారని అని తెలిపారు. ఈ స్టాక్ పాయింట్లకు పక్క జిల్లా అయినా అన్నమయ్య జిల్లా నుండి ఇసుక రీచ్ ల నుండి ఇసుక తీసుకొనివచ్చి ప్రజలకు సరఫరా చేస్తున్నారని అని తెలిపారు. జిల్లాలో గుర్తించిన మూడు డీసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం నందు, మరొకటి గూడలి గ్రామం కోట మండలం నందు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు వచ్చాయని, ఈ ప్రదేశము నుండి ఈ నెల 15 వ తేది లోపు ఇసుక సరఫరాను అందుబాటులోకి తీసుకొని రానున్నారని తెలిపారు. డీసిల్టేశన్ పాయింట్ వద్ద ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీని నియమించడం జరిగిందని అన్నారు. అక్కడ నుండి వినియోగదారులు ఆన్లైన్ నందు ఇసుక బుక్ చేసుకుని లేదా నేరుగా వెళ్లి ఇసుక కమిటీ నిర్ధారించిన నామ మాత్రపు రుసుము మేరకు ఇసుక తీసుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు,అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవి మనోహరాచారి, నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, గూడూరు ఏడి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డిడి గ్రౌండ్ వాటర్ నాగమల్లేశ్వర రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కోమాలో ఉన్న అంగన్వాడీ నేతను ఆదుకోవాలి

**ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి**

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** అంగన్వాడీల సమస్యల పరిష్కారంకై విజయవాడకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లిన పిచ్చాటూరు ప్రాజెక్ట్ అంగన్వాడీ నేత శ్రీవాణి (50)ని ఆదుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేఎస్ఎన్ ప్రసాదరావు, అధ్యక్షురాలు పద్మలీల, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరిలు సంయుక్తంగా ప్రభుత్వానికి మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అత్యున్నత వైద్యం అందించినట్లయితే కోలుకోవడానికి అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారని నేతలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీవాణి కుటుంబం అత్యంత పేద కుటుంబమని లక్షల ఖర్చయ్యే వైద్యానికి వీరి స్థోమత సరిపోదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటనను కేఎస్ఎన్ ప్రసాదరావు, పద్మలీల అధ్యక్షురాలు, రాజేశ్వరి ప్రధాన కార్యదర్శి తదితరులు విడుదల చేశారు.

### వెంకటగిరి చైర్‌పర్సన్ పదవి నుండి

## నక్కా బానుప్రియను తొలగించేందుకు ముమ్మర ప్రయత్నాలు

ప్రస్తుత చైర్‌పర్సన్ నక్కా భాను ప్రియ

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద

**ప్రజాశక్తి-వెంకటగిరి :** వెంకటగిరి చైరప్సన్ పదవి నుండి నక్కా బానుప్రియను దించేందుకు సొంత పార్టీ కౌన్సిలర్లు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సామాజికవర్గానికి చెందిన మాజీ చైర్‌పర్సన్ దొంతు శారధ ఈపదవిని దక్కించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి నారాయణ అండదండలు మాజీ చైర్‌పర్సన్ ఉన్నట్లు సమాచారం. త్వరలో తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్దం ఉన్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఆనం వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నక్కా బానుప్రియను పట్టుపట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ చేశారు. అప్పట్లో దొంతు శారధ కూడా ఈపదని ఆశించి భంగపడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి పద్మశాలీ రాష్ట్ర అధ్యక్షులు ఉన్న నక్కా వెంకటేశ్వర్లు మరదలకే ఈపదని దక్కే విధంగా చేశారు. నక్కా వెంకటేశ్వర్లు వ్యవహారశైలితో విసిగిపోయిన సొంత పార్టీ కౌన్సిలర్లు దొంత శారధ వైపు మొగ్గుచూపుతున్నారని సమాచారం. ఆర్థికంగా ఎంతైన ఖర్చు చేసేందుకు సిద్దంగా ఉన్న దొంత శారధ భర్త బాలకృష్ణ అసంతృప్తులను తన వైపు తిప్పుకున్నారని అర్థమౌవుతుంది. వెంకటగిరిలో ఎక్కడ విన్నా మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాసంపైనే చర్చ సాగుతుంది.

# బీజేపీ బ్లాక్ మెయిల్ నెం.1

**భారత్ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడతారా..?**

**యూరప్ దేశాలు తిరగబడి మూకుమ్మడిగా అమెరికాకు ఆంక్షలు విధించాయి**

**ఆదానీకి మేలు చేసే పనిలో కేంద్రం ముందుచూపు : సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** భారత్ ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం అమెరికాకు తాకట్టుపెట్టే చర్యలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. మంగళవారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అమెరికా ప్రెసిడెంట్ అయ్యాక వారి దేశంలోని ఏర్పడ్డ లోటు బడ్జెట్లో పూడ్చుకోవడానికి, అప్పుల నుంచి బయటపడేందుకు ప్రపంచ వ్యాప్తంగా షరతులు, ఆంక్షలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమెరికాపై 29 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉందన్నారు. వాటి నుంచి బయటపడేందుకు ట్రంప్ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వారికి బీజేపీ సాయశక్తులా సహకారమందిస్తోందని దుయ్యబట్టారు. వైసీపీ యువత పోరుపై విలేకరులు అడిగిన సమాధానం ఇస్తూ చేయాల్సిన వన్నీ చేసి తిరిగి పోరు చేస్తానంటే ఎలా.. అసెంబ్లీకి వెళ్లకుండా చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకొని చట్టసభల్లో ప్రజల గొంతు వినిపించకపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు.ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే రాధాకృష్ణ జె విశ్వనాథ్, బి నదియా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ శ్రీవాణికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి - పిచ్చా టూరు :** పిచ్చాటూరు అంగన్వాడి టీచర్, మండల మాజీ అంగన్వాడి సంఘం అధ్యక్షురాలు వాణిశ్రీ బ్రెయిన్ స్ట్రోక్‌తో చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. అంగన్వాడి రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు తమ కోర్కెలను సాధించుకోవాలని ధర్నా నిమిత్తం ఆదివారం రాత్రి బయలుదేరి సోమవారానికి సహ ఉద్యోగులతో కలిసి వాణిశ్రీ విజయవాడ చేరుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ధర్నా చేపట్టడానికి అలంకార్ ప్రాంగణానికి వెళ్తున్న సమయంలో హఠాత్తుగా వాణిశ్రీ కుప్పకూలి స్పృహ కోల్పోయింది. వెంటనే తోటి ఉద్యోగులు విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. వాణిశ్రీని పరిశీలించిన వైద్యులు చిన్న మెదడు చిట్లిపోయి మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు (బ్రెయిన్ స్ట్రోక్) నిర్ధారించారు. కనీసం 24 గంటలు గడిస్తే గాని ప్రాణాలకు గ్యారెంటీ చెప్పలేమని వైద్యులు తెలిపినట్లు సహ ఉద్యోగులు వెల్లడించారు. ప్రస్తుతం వాణిశ్రీకి వెంటిలేటర్‌పై చికిత్సను అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసెంబ్లీ నుండి అంగన్వాడి టీచర్ శ్రీవాణి చికిత్స పొందుతున్న విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ కు చేరుకొని బాధితురాలిని పరామర్శించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. వైద్యులు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

# ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు

- 150 గజాలలోపు గల ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్
- ఆపైన 451 గజాల వరకు 50 శాతం లేదా సాధారణ ఛార్జీలు
- అమల్లో పారదర్శకత ఏ మేరకో..?



**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** ఇళ్ల స్థలాల క్రమ బద్ధీకరణకు మార్గదర్శకాలు వెలువడ్డాయి. ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ జీవో నెంబర్ 30 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం 150గజాలలోపు గల ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఆపైన 451గజాల వరకు 50శాతం లేదా సాధారణ ఛార్జీలు విధిస్తారని సమాచారం. ఇందులో పేదల సంగతి కాస్త పక్కనబెడితే... పెద్దల విషయంలో ఏమేరకు పారదర్శకత ఉంటుందో వేచిచూడాల్సిందే. ముఖ్యంగా తిరుపతి జిల్లాలో కొన్ని వేల మంది దరఖాస్తుదారులు వేచి చూస్తున్నారు. చాలామంది ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని కొన్ని సంవత్సరాల నుంచి జీవిస్తున్నారు. అలాంటి వారికి ఈ జీవోతో కొంత మేరకు ఉపశమనం కలుగుతుందని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా తిరుపతి అర్బన్ పరిధిలోని సుందరయ్య నగర్, రైల్వే కాలనీ, జీవకోన, మంగళం లాంటి ప్రాంతాల్లో ఇళ్ల రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఉంది. ఇవేకాక హథీరాంజి బాలవాజీ భూముల్లో కూడా చాలామంది పేదలు నివాసం ఉంటున్నారు. వారి ఇల్లు కూడా రెగ్యులర్ అవుతాయా లేదా అనేది రెవెన్యూ అధికారుల నుండి ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబర్ 15లోపు ఉన్న ఇళ్ల క్రమ బద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో అభ్యంతరంలేని ప్రభుత్వ స్థలంలో ఆర్సిసి లేదా ఇంటి పైకప్పుతో కూడి ఇటుకల గోడల నిర్మాణాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. లబ్ధిదారుని కుటుంబం లేదా ఆ కుటుంబంలోని సభ్యుడి పేరు రాష్ట్రంలో మరెక్కడా సొంత ఇళ్లు లేకపోతేనే ఇది వర్తిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీముల ద్వారా ఇంతకు ముందు లబ్ధి పొంది ఉంటే తాజాగా కట్టిన ఇళ్లు రెగ్యులర్ చేసే అవకాశం ఉండదు. ఒకవేళ అన్ని అర్హతలూ ఉంటే, సంబంధిత కుటుంబంలోని మహిళ పేరున మాత్రమే రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తుంది. వీటన్నింటికన్నా ముఖ్యంగా దారిద్ర రేఖకు దిగువనున్న కుటుంబాలకు మాత్రమే క్రమ బద్ధీకరణ అమలుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీని ప్రకారం ఏడాదికి వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలకు మించరాదు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, పి.ఎస్.యు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగులకు అవకాశం లేదు. పది ఎకరాలకు మించని వ్యవసాయ భూమి లేదా తడి భూమి లేదా తడి, పొడి కలిపి 10ఎకరాలకు మించితే ఈ పథకం వర్తించే పరిస్థితి లేనట్లే. ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, నాలుగు చక్రాల వాహనదారులకు అవకాశం ఉండదు. వ్యవసాయ కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రక్కులు ఉన్నవారికి మినహాయింపు ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో గరిష్ట ఆదాయం రూ.1.44 లక్షలకు మించరాదు. కుటుంబానికి ఒక్కసారి మాత్రమే ఈ ఇళ్ల క్రబద్ధీకర వర్తించే విధంగా రూపకల్పన చేశారు. ఇళ్ల క్రబద్ధీకరణకు స్థల విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వం కేటాయింపు ధర నిర్ణయించింది. ఇంటి విస్తీర్ణం, దిగు పేద, ఎగువ పేద అనే తీరున విభజించి చెల్లించాల్సిన ఛార్జీలను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈలెక్కన 150 గజాల వరకు క్రమబద్ధీకరణ ఉచితమే. పట్టా జారీచేసిన రెండేళ్ల తరువాత డి-పట్టాతోపాటు కన్వేయర్ డీడ్ ఉచితంగా అందజేయనున్నారు. 151గజాల నుంచి 300 గజాల్లో ఉన్న ఇళ్లకు సంబంధిత స్థలానికి ప్రాథమిక విలువ కట్టి, దాన్నిబట్టి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారైతే రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారైతే సాధారణ ఫీజు చెల్లించాలి. 301 నుంచి 450 గజాల విస్తీర్ణంలోవున్న ఇళ్లకు కూడా పైన పేర్కొన్నట్లు ప్రాథమిక భూమి ఆధార విలువ ఆధారంగా 50 శాతం లేదా సాధారణ చెల్లించాల్సివుంటుంది. 541 గజాలకు పైగా ఉన్న ఇళ్లకు ఎపిల్, బిపిఎల్ అనేదానితో సంబంధం లేకుండా సాధారణ రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సివుంటుంది. అర్హులైనవారు వార్డు లేదా గ్రామ సచివాయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని సంబంధిత విఆర్ఓ క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం, సంబంధిత తహసీల్దార్లకు నివేదిస్తారు. అక్కడి నుంచి ఆప్రూవల్ కమిటీకి చేరుతాయి. అర్‌ఓ లేదా సబ్- కలెక్టర్ ఛైర్మన్ గాను, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, తహశీల్దార్ సభ్యులుగా ఉండే ఈ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది.

**సచివాయాల్లో దరఖాస్తుచేసుకోండి : తాసిల్దార్ భాగ్యలక్ష్మి**

**ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రజలు వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తిరుపతి అర్బన్ తహసిల్దార్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకోసం తాసిల్దార్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు. సచివాలయ సిబ్బందికి అన్ని వివరాలు అందజేస్తే వాటిని అప్లోడ్ చేసి తమకు పంపడం జరుగుతుందన్నారు. దాన్ని పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.**

## మున్సిపాలిటీ అవినీతిపై విచారణ చేపట్టాలి

శాసనసభలో ఎమ్మెల్యే భానుప్రకాష్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు మున్సిపాలిటీలో 2019 -24 సంవత్సర కాలంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ కోరారు. మంగళవారం ఆయన శాసన సభలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అనుమతి లేకుండా మున్సిపల్ భవన నిర్మాణం చేపట్టారని, మరమ్మతుకు గురైన ట్రాక్టర్లు, బిన్, జెసిబి, విద్యుత్ లైట్లకు సంబంధించిన వాటిపై తక్కువ రేటుకు అమ్మేసి స్వాహా చేశారన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతులకు గురైనది, రిపేరు చేసేందుకు జనరల్ నిధుల నుంచి రూ.40 లక్షలు వరకు డ్రా చేశారన్నారు. వాటికి నాలుగు వేల రూపాయలు కూడా ఖర్చు పెట్టకుండా స్వాహా చేశారని ఆరోపించారు. డంపింగ్ యార్డును నిర్వహించని, ప్రతినెలా పదివేల రూపాయలు చొప్పున ఏటీఎం మిషన్లో డ్రా చేసి స్వాహా చేశారన్నారు. ఇంకా మిగిలిన వాటిలో డీజిల్ బిల్ పేరుతోను స్వాహా చేశారన్నారు. వీటిపై సమగ్రంగా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ స్పందించి విచారణ కమిటీ వేసి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయంపై ఆయన పలు అంశాలు అసెంబ్లీలో ప్రస్తావించారు. స్పందించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ పుత్తూరు మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగం వాస్తవమేనని నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేశారని, విచారణ కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి సమాధానమిచ్చారు.

## పని ఒత్తిడి తగ్గించండి

ఎంపీడీవోకు కార్యదర్శుల వినతి

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడి వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని ఎంపీడీవోకి మంగళవారం వినతిపత్రం అందించారు. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశించిన కార్యక్రమాలు అమలు పరిచే పనిలో పని ఒత్తిడి అధికంగా వుండడంతో సెలవు దినాల్లోనూ పని చేయడం వల్ల అనారోగ్యం పాలవుతున్నామని మండల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శులపై పడుతున్న పని ఒత్తిడిని తగ్గించే విషయమును కలిగించాలని ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు.

## పరీక్షా సామగ్రి వితరణ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎల్‌ఐసి మహిళ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల విలువ చేసే పరీక్ష సామాగ్రిని బిసి, ఎస్‌సి, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌లోని 9, 10వ తరగతి విద్యార్థినులకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ హేమాద్రి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యూనియన్ కార్యదర్శి ఎన్ లక్ష్మణ కుమార్ మాట్లాడుతూ ఎల్‌ఐసి ఉద్యోగులు, యూనియన్ సామాజిక కార్యక్రమంలో ఎల్లవేళా ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు డి దస్తగిరి, మహిళా ఉద్యోగినులు రమాదేవి, రాజరాజేశ్వరి, మహావాణి, మాధవి, గీత, సంక్షేమ హాస్టల్ వార్డెన్లు భాను, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 14 లోపు రైతులు ఈకేవైసీ చేసుకోవాలి

**ప్రజాశక్తి- యర్రావారిపాలెం:** రైతులు ఈ నెల 14వ తేదీ లోపు ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాష పేర్కొన్నారు. మండలంలో రైతులు రబీ సీజన్‌లో 2025- 26 పంటలకు సంబంధించి ఈ పంట యాప్‌లో ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఇప్పటి వరకు మండలంలోని రైతులు 754 మంది ఈ పంట యాప్‌లో 1184.65 ఎకరాలకు పంట నమోదు చేసుకోగా, 1023.60 ఎకరాలకు 679 మంది రైతులు ఈ కేవైసీ పూర్తి చేసుకున్నారని, ఈ కేవైసీ, ఈ పంట నమోదును రైతులు ఈ నెల 14వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. లేదంటే ప్రభుత్వం అందించే పథకాలు ఏవీ అందుకునే అవకాశం లేదని తెలిపారు.

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. మండలంలోని రైతు రిజిస్ట్రీ అమలు ప్రక్రియను ఆమె మంగళవారం కంచన పుత్తూరు కుంభాకం, నెల వాయి, కాటూరు కనమనంబేడు, పెద్దపాలేడు, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించారు. రైతుల వివరాలు రైతు గుర్తింపు సంఖ్యకోసం ఆన్ లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వారి ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్, పాస్ బుక్, తీసుకుని రైతు భరోసా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య వుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు భాస్కర్, జగదీష్, బాలమురళీకృష్ణ, ఏఈఓ రేవతి, వీఏఎ లావణ్య, భరత్ కుమార్ పాల్గొన్నారు.

## మోడల్ టెస్ట్ విజయవంతం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** స్థానిక స్వామి వివేకానంద స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ మోడల్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నపత్రాలను స్వామి వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ సదాశివ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మహేష్, స్వామి వివేకానంద స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు సహకరించండి

గూడూరు మున్సిపల్ కమిషనర్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** పట్టణ ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని మున్సిపాల్టీకి చెల్లించాల్సిన ఇంటి పన్నులు కుళాయి, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించి గూడూరు పట్టణాభి వృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలందరూ సహకరించాలని తడి, పొడి చెత్త ప్రమాదకర చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని దీనివల్ల జబ్బులు రాకుండా ఉంటాయన్నారు. ప్రమాద కర స్థాయిలో వున్న ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. వ్యాపారులకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సకాలం లో ఇంటి పన్నులు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - నాయుడుపేట:** సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈరోజు నెల్లూరు జిల్లా కేంద్రంలో నిర్వహించే యువత పోరును విజయవంతం చేయాలని వైయస్సార్సీపి నాయుడుపేట పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఒట్టురూ కిషోర్ యాదవ్‌లు కోరారు. అలాగే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఉదయం ఎనిమిది గంటలకు జెండా ఆవిష్కరణ, యువత పోరు కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## ఇసుక అక్రమ రవాణాపై దాడి

**ప్రజాశక్తి - సత్యవేడు :** సత్యవేడు నియోజకవర్గం, అల్లపగుంట గ్రామానికి సమీపంలో బీడు బంజర భూమిలో అనధికారికంగా నిల్వ ఉంచిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. రాత్రి సమయాలలో తమిళనాడుకు తరలిస్తూన్నారనే సమాచారంతో, మంగళవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి నాయుడు ఇసుక నిల్వలపై దాడి చేశారు. సుమారు 15 యూనిట్ల ఇసుకను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక నిల్వను నాగలాపురం రెవిన్యూ అధికారులకు అప్ప గించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎస్సై రామస్వామి, నాగలాపురం ఎస్సై సునీల్‌లు పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** గుంటూరు జిల్లా, మాచెర్ల, పి. డబ్ల్యూడి, కాలనీకి చెందిన సైదాబీ (12) బాలిక స్విమ్స్ సి.టి. సర్జరీ విభాగంలో ఛాతీలో పెద్ద గడ్డతో బాధపడుతూ ఫిబ్రవరి11 న అడ్మిట్‌అయింది. ఆ బాలికకు ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సి.టి. సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యవతి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఛాతీలో గడ్డ పెద్దదిగా వున్నందున, సంక్లిష్టముగా ఉందని ఊపిరితిత్తులు, గుండెకి గడ్డ అతుక్కుని వుండటంతో ఆపరేషన్ క్లిష్టమైంని తెలిపారు. బాలిక పూర్తిగా కోలుకుని మార్చి 10వ తేదిన సాయంత్రం డిశ్చార్జ్ అయిందని తెలియజేశారు.

## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** మాండలైజ్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనారు. అండర్ 14 విభాగంలో జాషువా, అండర్ 17 విభాగంలో లోకేష్ లు జాతీ య స్థాయిలోకి ఎంపికైనారు. ఈనెల 20, 21 వ తేదీల్లో హిమాచల్ ప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయి శుభ్ ఆరంభ్ ట్రోఫీలో పాల్గొంటారు అన్నారు.అనంతరం విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు శివ కుమార్ , భారతి , హరి కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్ కిట్' పంపిణీ

**ప్రజాశక్తి -ఏర్పేడు :** మండలంలోని పల్లం జిల్లా పరిషత్ స్కూల్ నందు1998 -2000 విక్రమ్ బ్యాచ్ తరపున మరోసారి పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు కె వి బాబు, విజయ్ శేఖర్, రామచంద్రయ్య, పుష్ప వాణి, రామ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** వీలైనంత త్వరగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మెయిన్స్ పరీక్ష నిర్వహించేలా మంత్రి నారా లోకేష్ చొరవ చూపించాలని కానిస్టేబుల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారని, అటు తర్వాత ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారన్నారు. కోర్టులలో పలు రకాల కేసులు పోలీస్ కానిస్టే బుల్ రిక్రూట్మెంట్ మెయిన్స్ పరీక్షకు సంబంధించి వేసారని, మంత్రి పరిష్కారం చేసి మెయి న్స్ పరీక్షను నిర్వహించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కోచ్ కిరణ్, కానిస్టే బుల్ అభ్యర్థులు సురేష్, దర్బార్ నాయక్, హేమాద్రి, వెంకటేష్, హరికృష్ణ, తరుణ్, నరేష్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలి

**ప్రజాశక్తి- ఏర్పేడు :** వివిధ రకాల సర్వేలతో, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు నిర్వహించడంలో తగిన సమయం ఇవ్వకపోవడం వలన పంచాయతీ కార్యదర్శులు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా సిబ్బంది కోరారు. మంగళవారం ఏర్పేడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సౌభాగ్యమ్మకు ఈ విషయమై వినతి పత్రాన్ని అందించారు.

## జగన్ ఇంటిముందు చెయ్యండి 'యువత పోరు'

**ప్రజాశక్తి - క్యాంపస్ :** మార్చి 12న వైఎస్సార్‌సీపీ చేపట్టే 'యువత పోరు' కార్యక్రమం పోస్టర్‌ను వైసీపీ దొంగల ముఠా అంతాకలిసి విడుదల చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన సకాలంలో చెల్లించని జగన్, ఇప్పుడు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ అన్నారు. ఈ కార్యక్రమం టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ,విష్ణు వర్ధన్,వెంకటేష్,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్, ఏ.పి.ఆర్.జే.సి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు, 10వ తరగతి మార్చ్ 2025 పరీక్షలకు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని,రాష్ట్ర స్థాయిలో 25 ఏప్రిల్ న ప్రవేశ పరీక్ష నిర్వాహించ బడునని, దరఖాస్తులు సమర్పించుటకు మార్చి 31 చివరి తేదీ అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 30న జరుగుతుందని విశ్వం పోటి పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయినా, ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999 నెంబరులకు సంప్రదించ వచ్చునని తెలిపారు.

## గీతకులాల మద్యం షాపు మార్పుకి నోటీసు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** గీత కులాల వారికి తిరుపతి రూరల్ పరిధిలో కేటాయించిన మద్యం షాపును వేరొక ప్రాంతానికి మార్పు చేయుటకు నోటీసు జారీ చేయడమైనదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగ మల్లేశ్వర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అధికారిక కారణాల దృష్ట్యా, సదరు మద్యం షాపును అవిలాల సాయినగర్ పంచాయతీ నుండి వేరొక ప్రదేశమునకు మార్పు చేయుటకు లైసెన్సు దారుడికి నోటీసు జారీ జారీ చేశామన్నారు.

## వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులుగా చెంచు మోహన్ యాదవ్

**ప్రజాశక్తి రామచంద్రాపురం (తిరుపతి రూరల్)** చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిఫార్సుల మేరకు చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులుగా చెంచు మోహన్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చెంచు మోహన్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మే 15 నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను మే 15 నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణతో కలిసి తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా కె. నారాయణ, వైస్ ఛైర్మన్‌గా ఎక్స్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మోహన్ రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రమణ, ప్రధాన కార్యదర్శిగా పి.రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.రవి, కార్యదర్శులుగా కె.శివారెడ్డి, ఎం.యుగంధర్, జి.సంతోష్ కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

## ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు పంపండి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసేందుకు, పారదర్శకంగా నిర్వహించుటకు అపరిష్కృతంగా ఉన్న పలు ఎన్నికల ప్రక్రియ అంశాలకు గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యం, సలహాలు సూచనలు అమూల్యమైనవనీ భారత ఎన్నికల సంఘం సూచించింది. సలహాలు సూచనలను ఏప్రిల్ 30 నాటికి తెలపాలని భారత ఎన్నికల సంఘం ఆహ్వానించింది.

## విద్యార్థులకు అవసరమైన వస్తువుల వితరణ

**ప్రజాశక్తి - తడ:** తడ మండలం, వాటంబేడు ఉన్నత పాఠశాలలో సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు వాటర్ బాటల్స్, ప్యాడ్లు, జామెంట్రి బాక్స్, పెన్నులు తదితర వస్తువులును రోటరీ క్లబ్ దాతృత్వంతో పూర్వపు అసిస్టెంట్ గవర్నర్ విజయలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కె మల్లిఖార్జున రావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలన్నారు.

## హామీలు అమలు చేయకపోతే 24,25 తేదీల్లో బ్యాంకుల బంద్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఈ నెల 24 25వ తేదీ దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్ చేసి సమ్మె చేస్తామని కేంద్రానికి హెచ్చరించారు. మంగళవారం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు మునియన్ పిలుపు మేరకు స్థానిక వైకేటి రోడ్‌లో ఉన్న ఇండియన్ బ్యాంకు జోనల్ ఆఫీస్ ఎదుట యుఎఫ్‌బియు కన్వీనర్ విజయ బాస్కర్, టీబీఈసీసీ ప్రధాన కార్యదర్శి ధన్వంత్ కుమార్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్ధన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలత, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, మహేష్ బాబు. నందకుమార్, పవన్ కుమార్ శంకర్ రావు ,లక్ష్మీపతి, నటరాజ్, బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రైం న్యూస్

### అంగన్వాడీ కేంద్రానికి నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

కాలిన అంగన్వాడీ తలుపు, బడి బయట చిన్నారులు

**ప్రజాశక్తి - పిచ్చా టూరు:** పిచ్చాటూరు మండలం, కారూరు ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడి కేంద్రం తలుపులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు స్థానికులు తెలిపారు. ఈ అంగన్వాడి కేంద్రంలో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ అధికారులు రాత్రి వేళలో గస్తీలు నిర్వహించాల కోరారు. చోరీలు, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీ కేఫ్ దగ్ధం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోనీ బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో ఫ్రెండ్స్ టీ కేఫ్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గూడూరు ఇన్చార్జి అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు షార్ట్ సర్క్యూట్ కారణం గా మంటలు చెలరేగడంతో కేఫ్ దగ్ధమైందన్నారు. సుమారు రూ. 2 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు.

### భార్యపై హత్యా యత్నం

హత్యాయత్నం చేసిన హరిబాబు, గాయపడిన లక్ష్మీ ప్రియ

**ప్రజాశక్తి - పెళ్లకూరు :** ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను కట్నం తెమ్మని, హింసిస్తూ చివరకు హత్యా యత్నానికి ఒడిగట్టిన ఓ ఉన్మాది ఉదతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరుకు చెందిన పతకాని లక్ష్మీప్రియ (24) ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండేది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి, గుంట కింద పల్లి గ్రామానికి చెందిన హరిబాబుతో (25)తో ప్రేమలో పడింది. ఇద్దరూ పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తిలో కాపురం పెట్టారు. వారిద్దరి మధ్య అభిప్రాయ బేధాలు వచ్చి అవ తారాస్థాయికి చేరుకున్నాయి. అదన పు కట్నకోసం హరిబాబు హింసించేవాడు. అతను ఇష్టామొ చ్చినట్లు కొడుతుండటంతో లక్ష్మీప్రియ అనారోగ్యానికి గురైంది. మంగళవారం హాస్పిటల్‌లో చూపిస్తానని నమ్మబలికిన హరిబాబు శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వచ్చేదారిలో టెంకాయ తోపు వద్ద పొలాలలోకి ఆమెను తీసుకెళ్లి స్క్రూ డ్రైవర్ తో హత్యయత్నం చేశాడు. అటుగా వెళుతున్న యువకులు గమనించి అడ్డుకుని, పోలీ సులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి, యువతిని ఆసుపత్రికి తరలించి, హరిబాబుపై కేసు నమోదు చేశారు.

## ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి

మామిడి రైతుల శిక్షణ సమావేశంలో ప్రసంగిస్తున్న వక్తలు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** ఒకే పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలపై ముగ్గు చూపాలని మాజీ ఎంపీపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు మార్కెట్ కమిటీలో మంగళవారం ఉద్యానవన శాఖచే మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం, పుత్తూరు, వడమాల పేట, నారాయణవనం, మండలాల రైతులకు ఉద్యానవన మండల అధికారి వెంకట సౌజన్య ఆధ్వర్యంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, డ్రిప్ పిడి సతీష్, శాస్త్రవేత్త రంజిత్, పద్మశాలి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రైతులకు వివిధ సాగు మెలకువలు సూచించారు.ఈ కార్యక్రమంలో పుత్తూరు వ్యవసాయ శాఖ ఏడి రమేష్ రాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి కోదండయ్య, వడమాల పేట వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, నారాయణవనం వ్యవసాయ అధికారి, రైతులు, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన కోడూరు దంపతులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** విజయవాడలోనే తాడేపల్లిలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని గూడూరు మాజీ పురపాలక సంఘఛైర్పర్సన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పలత, సీనియర్ నాయకులు కోడూరు మీరా రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## పంట బీమా అమలుకు చర్యలేవి ?



**తిరుపతి పార్లమెంటు పరిధి వివరాలు ఇవ్వండి : లోక్ సభలో ఎంపీ గురుమూర్తి**

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన కింద రైతుల నమోదు, అమలులో ఎదురవుతున్న సవాళ్ళు, సరిగా అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మంగళవారం లోక్ సభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన, మార్పు చేయబడిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్) కింద 2.63 లక్షల మంది రైతులు తమ పంటలకు బీమా నమోదు చేసుకున్నారని తెలిపారు. సంవత్సరాల వారీగా ఈ పథకం కోసం నమోదు చేసుకొన్న రైతుల వివరాలు తెలుపుతూ 2022-23 సంవత్సరంలో 1,09,865 మంది రైతులు 1,16,895 హెక్టార్ల భూబాగానికి నమోదు చేసుకొన్నారని, 2023-24 సంవత్సరంలో 1,18,880 మంది రైతులు 1,42,695 హెక్టార్ల భూబాగానికి నమోదు చేసుకొన్నారని తెలిపారు. కాగా 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 35,553 మంది రైతులు 45,507 హెక్టార్ల భూబాగానికి నమోదు చేసుకొన్నారని తెలియజేశారు. ఈ పథకం కింద వరి, వేరుశెనగ, సజ్జలు, ప్రత్తి, పెసలు, మొదలగు పంటలకు బీమా అందించబడుతుందని తెలియజేశారు. రైతులకు అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా 2024-25 రబీ సీజన్ నుండి పథకం కోసం రైతులు వారే స్వచ్ఛందంగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయము, న్యూ మంగళం (శెట్టిపల్లి)

రిక.నెం.17/2025 తేది:10-03-2025

**వేలము ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా న్యూ మంగళం (శెట్టిపల్లి) గ్రామ పంచాయితీ కి 2025 -2026 సంవత్సరమునకు అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు గ్రామ పంచాయితీ కి అవసరముగు క్రింద కనిన వస్తువులను సరఫరా చేయుటకు షీల్డు టెండర్ల ద్వారా తేది 19-03-2025 ఉదయం 10 గంటల నుండి 03.00 గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లను హాజరైన టెండరుదారుల సమక్షమున 04.30 గంటలకు సదరు షీల్డు టెండర్లను తెరవబడును. టెండరు నందు పాల్గొను వారు ధరావత్తులను బ్యాంకరు చెక్కు, డి.డి ద్వారా (SBI Bank) పొంది అందజేయవలయును సదరు టెండర్లను పాక్షికముగా, పూర్తిగా వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు గ్రామ పంచాయితీ కార్యదర్శి కి పూర్తిగా అధికారము కలదు. మిగిలిన విషయములు ఆఫీసు పనిచేయు వేళలలో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం | సరఫరా చేయవలసిన వాటి వివరములు | చెల్లించవలసిన ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | ప్రజారోగ్య పరికరములు సరఫరా చేయుట | 5,000-00 |
| 2. | రక్షిత మంచినీటి సరఫరా పరికరములు సరఫరా చేయుట | 5,000-00 |
| 3. | వీధి దీపముల విద్యుత్ పరికరములు సరఫరా చేయుట | 10,000-00 |
| 4. | స్టేషనరీ పరికరములు సరఫరా చేయుట | 1,000-00 |
| 5. | గ్రామ పంచాయితీ యొక్క నీటి సరఫరా మోటార్లు, స్టార్టర్లు రివైండింగ్ మరియు రిపేరు చేయుట మరియు మోటారు దించుట, బయటకు తీయుట | 2,000-00 |
| 6. | వీధిలైట్లు రిపేరు చేసి అమర్చుట మరియు వీధిలైట్లు ఉదయము ఆఫ్ మరియు సాయంత్రం ఆన్ చేయుట ఎలక్ట్రిషియన్ బాధ్యత (నెల ఒకటికి) | 1,000-00 |
| 7. | గ్రామ పంచాయితీ నందు వున్న పాత ఇనుప సామాన్లు మరియు పాత వార్త పత్రికలు వేలం | 1,000-00 |

**షరతులు :** 1. షెడ్యూలు ఫారము ఖరీదు రూ.500/-లు, 2. టెండరు షెడ్యూలు ఫారములు తేది: 14-03-2025 సాయంత్రం 5.00 గంటల వరకు పొందవలెను. 3. టెండర్లు రేట్లు మార్కెట్ రేట్లకు లోబడి అనగా M.R.P రేట్లకు లోబడి యుండవలయును. అధిక రేట్లను కోట్ చేసిన యెడల టెండరును రద్దు చేయబడును. 4. ISI ముద్రగల నాణ్యమైన సామాగ్రిలు మాత్రమే సప్లై చేయవలెను. 5. Income Tax రిటర్న్స్, సేల్స్ టాక్స్ క్లియరెన్స్ వ్యాట్ వివరములను మరియు ఆధార్ కార్డు జతపరచవలెను. 6. గ్రామపంచాయితీ ఆర్థిక పరిస్థితిని బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- **శ్రీ N. మురళి**
**పంచాయితీ కార్యదర్శి**
**న్యూ మంగళం(శెట్టిపల్లి) గ్రామపంచాయితీ.**

సం/- **శ్రీమతి .జె. వీరమ్మ**
**సర్పంచ్,**
**న్యూ మంగళం(శెట్టిపల్లి) గ్రామపంచాయితీ.**

**మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**
**S.O.P. No.108/2024**

1. Guntakovela @ Guntakuvvala Rajamma
2. Guntakovela @ Guntakuvvala Murali
3. Gimtakovela @ Guntakuvvala Muni Raja
4. Tankasala Deepa ... **Petitioners**

**Vs.**

Nil ...**Respondent**

**జనరల్ నోటీసు**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైమనగా పై నెంబరు పిటిషనులో 1వ పిటిషనరుకు భర్త మరియు 2,4 పిటిషనర్లుకు తండ్రి అయిన జి.మునెయ్య ఆచారికి తేది 23.11.2020న జోరేపల్లి శ్రీనయ్య వ్రాసి ఇచ్చిన రెండు ప్రామిసరి నోట్లకు సంబంధించి వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో పిటిషనర్లు దావా దాఖలు చేసినందున పై కోర్టులో సక్సెషన్ సర్టిఫికేట్ దాఖలు చేయుటకు పిటిషనర్లు పై కోర్టులో పిటిషన్ పెట్టినందున ఎవరికైనా ఆక్షేపణలు వున్న యెడల తేది 04.04.2025న పై వారి కోర్టులో ఉదయం గం॥ 10:30ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

ఇట్లు
**P.GOPAL REDDY**
**P. NARENDRA**
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
గూడూరు.

**IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.**
**C.M.A.NO. 8 /2023.**

Between:-
M. Chengalrayalu ...Appellant
And:-
S.D. Munaswamy and others ....Respondents

To
**Respondent No.8**
Sanati Bhargavi, Wife of Hemabhushanam, daughter of Late S. Chandraiah, residing at Peradam Village, Satyavedu Mandal, Chittoor District.
**Respondent No.9**
Sanati Niranjini Wife of O. Marthala Palani, daughter of Late S. Chandraiah, residing at Peradam Village, Satyavedu Mandal, Chittoor District.

**NOTICES TO RESPONDENTS NO. 8 and 9**

Please take Notice that the above CMA No. 8 of 2023 field by the Appellant for setingaside the I.A.NO.39 OF 2018 in O.S.NO.72 OF 2016 on the file of Junior Civil Judge's Court, Satyavedu and the matter is posted to 15-04-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-parte.

Date of hearing: 15-04-2025.

(BY ORDER OF COURT)
**G. RAJESWARA RAO,**
**ADVOCATE FOR APPELLANT.**

**IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) OF PAKALA**
**E.A.No.38 of 2022**
**E.P.No. of 2022**
**O.S.No. 186 of 2018**

Between:
**M.Rajaiah** ...Petitioner/D.Hr.
And:
**T.Prabhakar (died) rep. by his L.Rs.** ....Respondents/J.Drs.

**NOTICES TO THE PROPOSED JUDGMENT-DEBTORS No.4 & 5**

To:
**1)T.Baby,** D/o late T.Prabhakar, D.No.21-68, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.
**2) T.Sujatha,** D/o late T.Prabhakar, D.No.7-129, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.

**Madam,** Please take notice that the above named D.Hr. filed the above E.A. seeking order to attach E.P. schedule mentioned property by dispensing notice to the L.Rs./ Proposed J.Drs. No.2 to 7 and the above E.A. is posted to **26-03-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m.** either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Place:Pakala Sd/-**G.B.PRASANNA**
Date:11-03-2025 Counsel for Decree-holder

**IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) OF PAKALA**
**E.A.No.39 of 2022**
**E.P.No. of 2022**
**O.S.No. 186 of 2018**

Between:
**M.Rajaiah** ...Petitioner/D.Hr.
And:
**T.Prabhakar (died) rep. by his L.Rs.** ....Respondents/J.Drs.

**NOTICES TO THE PROPOSED JUDGMENT-DEBTORS No.4 & 5**

To:
**1)T.Baby,** D/o late T.Prabhakar, D.No.21-68, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.
**2) T.Sujatha,** D/o late T.Prabhakar, D.No.7-129, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.

**Madam,** Please take notice that the above named D.Hr. filed the above E.A. to implead the LRs of the 1st J.Dr(T.Prabhakar) as J.Drs. 2 to 7 and the above E.A. is posted to **26-03-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m.** either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Place:Pakala Sd/-**G.B.PRASANNA**
Date:11-03-2025 Counsel for Decree-holder

**In The Court of the IInd Additional Civil Judge (Junior Division) Tirupati**
**O.S.No. 781/2023**

S.K.Parimala and Two Others ...Plaintiffs
V/s
M.S.Bharathi and 5 others ...Defendents

**SUIT SUMMONS TO DEFENDENTS 4,5,6**

D4) Murakambat Sundaram Gururajan, S/o Late M.S.Sundaram Raju
D5) Murakambat Yogapriya, D/o Late M.S. Sundaram Raju
D4, D5 R/o D.No.256/A, 5th Cross, Saptagiri Nagar, Venkateswara Colony, Mangalam, Tirupati Rural Mandal & District
D6) Murakambat Sundaram Prasanna Kumar S/o Late M.Kuppaswami Iyar Sundaram, D.No.9-128/1/91, Vijayapuram Colony, Sathyanarayanapuram, Tirupati, Tirupati Dist.

పై దావాను వాదులు ప్రతివాదులపై దావా షెడ్యూల్ పై భాగపరిష్కారం కొరకు వేసి ఉన్నారు. సదరు దావా నందు 4, 5 మరియు 6వ ప్రతివాదులైన మీ యొక్క హాజరు నిమిత్తం మీ యొక్క అభ్యంతరములు తెలుపుకునటకు 24-3-2025 తేదీ కి వాయిదా వేసి ఉన్నారు. సదరు 24.03.2025వ తేది సదరు దావా నందు 4,5,6 ప్రతివాదులయిన మీరు పై కనిన కోర్టుకు ఉదయం 10.30 గంటలకు నేరులో అయినను వకీలు ద్వారా అయినను హాజరు అయి మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసింది లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

**వాయిదా తేది. 24.03.2025**
**ఐ.సి.ఎస్.రెడ్డి, సి.లీలా శ్రీనివాస వర్మ**
వాదులు తరపు న్యాయవాదులు, తిరుపతి

# పోటాపోటీగా టిటిడి ఉద్యోగుల క్రీడలు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** టిటిడి ఉద్యోగుల క్రీడాపోటీలు మంగళవారం పోటా పోటీగా జరిగాయి. క్యారమ్స్ – మహిళ అధికారుల క్యారమ్స్ సింగిల్స్ పోటీలలో డా. సుహర్ లత విజయం సాధించగా డా. కుసుమ కుమారి రన్నర్‌గా నిలిచారు. మహిళాధికారుల క్యారమ్స్ డబుల్స్ పోటీలలో డాక్టర్ సుహార్ లత, దామర సెల్వి విజయం సాధించగా, డాక్టర్ కుసుమ కుమారి, కుమారి నీలిమ రన్నర్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ 45 ఏళ్ల పైబడిన పురుష ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ సింగిల్స్ పోటీలలో కిరణ్ కుమార్ రాజు విజయం సాధించగా ఆంజనేయులు రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన పురుష ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ డబుల్ పోటీలలో మురళి, ఆంజనేయులు విజయం సాధించగా, కిరణ్ కుమార్ రాజు, కృష్ణమూర్తి రన్నర్‌గా నిలిచారు. షటిల్ 45 ఏళ్లు పైబడిన మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్ పోటీలలో స్వప్న మంజరి విజయం సాధించగా, పద్మ రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్ల లోపు మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్ పోటీలలో శ్రీలక్ష్మి విజయం సాధించగా, మహాలక్ష్మి రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్ల లోపు మహిళా ఉద్యోగుల షటిల్ డబుల్స్ పోటీలలో భవ్య, విజయం సాధించగా, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి రన్నర్‌గా నిలిచారు.మహిళా ఉద్యోగులకు పరుగు పందెం, నడక పోటీలతో పాటు హిట్టింగ్ ది ఇండియన్ క్లబ్, బాల్ త్రో, లెమన్ స్పూన్, బకెటింగ్ ది బాల్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహించారు.

## ఎస్వీయూలో గణితశాస్త్రంలో కార్యశాల

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఎస్వీయు గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆల్జీబ్రా ఆల్జీబ్రిక్ నెంబర్ థియరీ టోపాలజీ అండ్ దేర్ అప్లికేషన్స్ 2025" అనే అంశంపై మూడు రోజులపాటు 12 నుంచి 14వ తేదీ వరకు కార్యశాల నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ ఆచార్య సి. జయసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి

### :శతావధాని ఆముదాల మురళి

### ఘనంగా శ్రీ అనంతకృష్ణశర్మ 46వ వర్ధంతి



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** సంగీత, సాహిత్య రంగాల్లో అపారమైన జ్ఞానం ఉన్న శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని శత అవధాని ఆముదాల మురళి కొనియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం ఉదయం శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 46వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆముదాల మురళి మాట్లాడుతూ శ్రీ రాళ్లపల్లికి సంగీతం, సాహిత్యం రెండు కళ్లు లాంటివని, శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనలను రాగి రేకుల నుండి పరిష్కరించి గ్రంథస్తం చేయడంతోపాటు వందల కృతులను స్వరపరిచారని తెలిపారు. రాగి రేకుల్లో పేర్కొన్న రాగాలతోనే స్వరపరిచారని, ఈ రాగాలు ప్రస్తుతం లేకపోయినా అన్నమయ్య కాలం నాటి సమకాలీన సంగీతాన్ని దృష్టిలో ఉంచుకుని బాణీలు కూర్చారని చెప్పారు. పాండురంగ మహత్యం, రంగనాథ రామాయణం మొదలగు గ్రంథాలలో ఇదివరకు ప్రచురణకర్తలు పొరపాటుగా ముద్రించిన పద్యాలను సరి చేశారని వివరించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీనారాయణ "శ్రీరాళ్లపల్లి వారి విమర్శ సాహిత్యం " అనే అంశంపై మాట్లాడుతూ, సారస్వత లోకం, నాటక లోకం అన్న గ్రంథాలలో రాళ్లపల్లి వారు అనేక వ్యాసాలను రచించినట్లు తెలిపారు అందులో నిగమ శర్మ – అక్క, రాయలనాటి రసికత, వేమన మొదలగు ఎన్నో వ్యాసాలు నీటికి విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నట్లు చెప్పారు. కట్టమంచి రామలింగారెడ్డి స్నేహంతో వారు ప్రాచీన ఆధునిక, విమర్శ పదాలను మేలవించారని తెలిపారు. రాళ్లపల్లి వారికి ఎక్కువ భాషలు తెలిసి ఉండడం, రాయలసీమ వ్యక్తి కావడం, వైష్ణవతత్వంపై అవగాహన ఉండడంతో అన్నమయ్య రాగిరేకుల్లోని కీర్తనలను ఎంతో ప్రామాణికంగా వెలుగులోకి తీసుకొచ్చారని తెలియజేశారు అనంతరం రాళ్లపల్లి మనుమరాలు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాళ్లపల్లి దీప్త మాట్లాడుతూ, రాళ్లపల్లి వారికి సంస్కృతం, ప్రాకృతం, తెలుగు, కన్నడ భాషల్లో మంచి పాండిత్యం ఉందని, ఈ కారణంగానే అన్నమయ్య రాగిరేకుల్లోని సాహిత్యాన్ని చక్కగా అర్థం చేసుకుని పరిష్కరించారని చెప్పారు. అప్పటి ఈవో పివిఆర్కె ప్రసాద్ చేతులమీదుగా టీటీడీ ఆస్థాన విద్వాంసులుగా నియామకమైన రోజే అనంతకృష్ణ శర్మ పరమపదించారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మార్గంలోని రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిపిపి ఏఈఓ రాములు, రాళ్లపల్లి రఘునందన్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో పుర ప్రజలు పాల్గొన్నారు.

## స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో 'సిఎంఈ'

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సి.యం.ఈ) మంగళ వారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో విజయ వంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.గిరిజ రెడ్డి, యం.పి.టి( యూరాలజి, ఓటెస్టిక్స్) ఫిజియెథెరపిస్ట్, ఫౌండర్ డైన క్లినిక్, కన్సల్టెంట్ క్లౌడిన్ హాస్పిటల్స్, మెడికొవర్ హాస్పిటల్, కావేరి హాస్పిటల్స్, బెంగుళూరు ముఖ్య అథితిగా విచ్చేసి స్విమ్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అనువైన విధంగా వారి సంబంధిత వృత్తులలో ప్రత్యేక నైపుణ్యాలను అందించారని, అలాంటి కార్యక్రమాల వలన విద్యార్థిని, విద్యార్థులో సృజరాత్మకత పెంపొందుతుందని తెలియజేశారు. స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాధవి మాట్లాడుతూ ఈ కార్యమాన్ని నిర్వహించడానికి అంగికరించిన స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఫిజియోథెరపి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. ముఖ్య అథితిగా డాక్టర్ బి.గిరిజ రెడ్డి "యూరినరీ ఇన్కంటినేన్స్ అండ్ పెళవిక్ రెహాబిలిటేషన్ " అనే అంశంపై మాట్లాడుతూ మూత్రం అపుకోలేని స్థితి అంటే మూత్రవిసర్జనను నియంత్రించలేకపోవడం. ఇది తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉండవచ్చునని, మూత్రనాళంలో వివిధ సమస్యల ఫలితంగా ఉంటుందని తెలిపారు. ఒత్తిడి ఆపుకోలేని స్థితి అంటే ప్రయత్నం, శ్రమ వల్ల మూత్రం లీకేజి కావడం. మూత్ర విసర్జన ఆపుకోలేని స్థితి. ఆకస్మత్తుగా లేదా అత్యవసరంగా మూత్ర విసర్జన చేయవలసిన అవసరంతో మూత్రం లీకేజ్ అవడం లక్షణాలు వున్న వెంటనే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు వహించాలని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ డాక్టర్. అపర్ణ ఆర్ బిట్ల ,కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ఫ్యాకల్టీ, నర్సింగ్, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కాలం నుంచి స్త్రీలపట్ల వివక్ష

**ప్రజాశక్తి - క్యాంపస్ :**ప్రాచీన కాలం నుంచి స్త్రీలపట్ల వివక్షత జరుగుతూనే ఉందని ఎస్వి ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా.యన్. భీమన్న పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో రెవరెండ్ స్వర్గీయ డా. కటాక్షమ్మ పాల్ రాజ్ ధర్మనిధి ఉపన్యాసం హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్ లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ హెచ్,ఎమ్ ఇన్చార్జ్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి, తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య మధుజ్యోతి, డా. వై. సుభాషిణి, డా. డి. యువశ్రీ, డా. బి. లక్ష్మీప్రియ, పరిశోధక విద్యార్థినులు, తెలుగు, ఆంగ్ల శాఖల విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేడు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ తిరుపతి ప్రాంతీయ కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి సహకారంతో రేపు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ తిరుపతి ప్రాంతీయ కేంద్ర ప్రారంభోత్సవం తిరుచానూరులో జరుగునుందని విశ్వవిద్యాలయం విసి ఆచార్య జియస్ఆర్ క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వర్చువల్ మాధ్యమంలో విచ్చేయనున్నారు. ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ట్రస్టీ డా.పద్మ సుబ్రహ్మణ్యం, ఐజిఎన్సిఏ జాయింట్ సెక్రటరీ డా. సచ్చిదానంద జోషి, విసి ప్రొ. జి.యస్.ఆర్ కృష్ణమూర్తి సమక్షంలో ఆయన ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఉన్న 9 ఐజిఎన్సిఏ ప్రాంతీయ కేంద్రాల జాబితాకు అదనంగా ఈ ప్రాంతీయ కేంద్రం తిరుపతిలో ప్రారంభించడం జరుగనున్నద న్నారు. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం శాస్త్రాధ్య యనానికి, సాంప్రదాయ శాస్త్రాలు, బోధనా విషయాల ఉన్నత అభ్యాసానికి ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా ప్రసిద్ధి చెందిందని వివరించారు. ఈ కేంద్రం ద్వార ప్రత్యేకించి సంగీత, శాస్త్రాంశాలపై దృష్టి సారించి, వేద, ఆగమ, సహజ సాహిత్యం యొక్క మౌఖిక సంప్రదాయాలను సంరక్షిస్తుందని, ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా సాంస్కృతిక వారసత్వంపై ఐజిఎన్సిఏ విస్తృత పరిశోధన, ముద్రణ, ముద్రణేతర ఫార్మాట్లలో దాని వైవిధ్యమైన ప్రచురణలతో పరిశోధకులు, విద్యావేత్తలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ కేంద్రం స్థాపన చాలా అవసరమని తెలిపారు. ఈ ప్రాంతీయ కేంద్రం ద్వారా క్షేత్రీయ అధ్యయనాలు, జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, సమావేశాలు, ఉపన్యాసాలు, థీమ్ ఆధారిత సాంస్కృతిక ఉత్సవాలు, వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు మరియు డాక్యుమెంటరీల ద్వారా విద్యా మరియు పరిశోధన కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

## ఐక్యూ నుంచి నియో 10ఆర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** ఐక్యూ అధిక-పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్, మంగళవారం తన తాజా పవర్‌హౌస్ ఐక్యూ నియో 10ఆర్ లాంచ్‌ను ప్రకటించింది. కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తూ, ఐక్యూ నియో 10ఆర్ కళాశాల విద్యార్థులు, టెక్ ఔత్సాహికులు యువ గేమర్‌ల కోసం రూపొందించబడింది. స్మార్ట్‌ఫోన్ సరికొత్త స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 3 మొబైల్ ప్లాట్‌ఫారమ్, అల్ట్రా-స్మూత్ స్టేబుల్ 90 ఎఫ్పీఎస్, గేమింగ్ కోసం 144హెర్జ్ రిఫ్రెష్ రేట్, సెగ్మెంట్ సన్నని 6400 ఎంఏహెచ్ బ్యాటరీతో సహా అత్యాధునిక ఫీచర్లను కలిగి ఉంది.




## శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**ప్రజాశక్తి -కోట :** కోట మండలంలోని గోడల్ని పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఎండోమెంట్ అధికారి శశాంక్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మంగళవారం శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు నిర్వహించగా 63 వేల 548 రూపాయలు ఉండినట్లు ఈవో శశాంక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి శశాంక్,ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు,గూడలి మాజీ సర్పంచ్ పల్లెమల్లు.వీర రాఘవరెడ్డి,సీనియర్ టిడిపి నాయకులు,దేవస్థానం చైర్మన్ పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి,కార్తీక్ స్వామి పాల్గొన్నారు.

## పోషక విలువలపై అవగాహన

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గర్భిణీలకు, బాలింతలకు పోషక విలువలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిపై ఉందని సిడిపిఓ షేక్ మెహబూబి సూచించారు. గూడూరు రెండో పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం పోషణ్ భీ పడాయి భీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాంచన, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు జ్యోతి, అంగన్వాడి సూపర్ వైజర్లు స్వరూప రాణి, హైమవతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంకేతిక యుగంలో సమానత్వపు అడుగులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విమెన్ స్టడీస్ విభాగము ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలను ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ స్త్రీలకూ రాజకీయ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే సమానత్వం పునాదిగా కలిగిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమములో మహిళా డీఎస్పీ శ్రీలత, ఆచార్య భాస్కర్ రెడ్డి, రమణ, రాజేశ్వరి, శ్రీలత కిషోర్, జగదీశ్వరి, సునీత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**శ్రీకాళహస్తి పరిధిలోని పలు ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పిళ్ళారి పౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పిళ్ళారి పౌండేషన్ అధినేత అమరావతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తునందించడానికి తమవంతు సహకారమందిస్తున్నందుకు ఆనందంగా తెలిపారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

## వేద విశ్వవిద్యాలయంలో ఆగమ సిద్ధాంతంపై కార్యశాల

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఆగమసంకాయ పర్యవేక్షణలో గల వైఖానస, పాంచరాత్ర, శైవ ఆగమముల సిద్ధాంతములు వాటి మౌలిక స్వరూపము, ఆగమ సిద్ధాంతం ద్వారా మోక్షస్వరూపము, భగవదారాధన ద్వారా మోక్షసిద్ధి మొదలైన అంశములపైన అంతర్జాతీయస్థాయిలో నేటినుండి 21 రోజులపాటు కార్యశాల నిర్వహించనున్నారు.